

# స్వచ్ఛత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం


# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

బుధవారం | 14 మే 2025 | 9 పేజీలు


■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

■ రూ. వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు
■ శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాలకు తాగు నీరు..
■ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదనలు
■ తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక దృష్టి

# ఏజెన్సీ గ్రామాలకు గోదావరి నుంచి తాగు నీరు

రక్షిత నీరు అందక కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్న మారు మూల గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన గోదావరి నీరు అందించేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దృష్టి సారించారు. కొమ్రం భీం ఆడ ప్రాజెక్టు నుంచి వస్తున్న రక్షిత నీటిని తాగడానికి గ్రామీణ ప్రజలు ఆసక్తి కనబర్చడం లేదు. నీటి సరఫరా కూడ అంతంతా మాత్రంగానే ఉండడంతో గిరిజన గ్రామాల ప్రజలు తాగు నీటి కోసం తంటాలు పడక తప్పడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే నేరుగా గోదావరి నీటిని గ్రామాలకు తరలించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మెషిన్ భగీరథ అధికారులకు సూచించారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి ఆదిలాబాద్ కు తాగు నీరు సరఫరా అవుతుంది. అదే విధంగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నీటిని సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాకు తాగు అందించేందుకు అధికారులు రూ.వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసారు. ఈ ప్రతిపాదనల్లో ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లోని గ్రామాలన్నింటికి తాగు నీరు అందించేంచేందుకు రూ. వెయ్యి కోట్లతో ప్రతి పాదనలు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. బైంసా మండలం మాటేగామ్ నుంచి ఉట్నూర్ వరకు సుమారు 150 కిలోమీటర్‌ల మేర పైప్ లైన్ అవసరం ఉంటుందని, నీటిని శుద్ధి చేసేందుకు నీటి శుద్ధి ప్లాంట్ నిర్మించాలని ప్రతిపాదించారు.





7

## ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్

■ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలి
■ కలెక్టర్ కుమార్ దీపక్

## 136 క్వింటాళ్ల జొన్నలు సీజ్



9



## జొన్నల కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి

■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
■ బేల మార్కెట్ యార్డులో కొనుగోళ్లను పరిశీలించిన కలెక్టర్

## పిల్లలకు చిన్నప్పటి నుంచి వ్యాయం అవాటు చేయాలి

పిల్లల పార్కును ప్రారంభించిన ఎస్పీ అఖిల్ మహాజన్



9



## ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

■ ఆదివాసీలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం
■ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క

# స్వచ్ఛత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

## ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్



**జన్నారం, మే 13 (ప్రభాత సమాచారం)**
ప్రతి ఒక్కరూ పరిసరాల చుట్టూ స్వచ్ఛతను పాటించాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం జైబాపు...జైభీం...జై సంవిధాన్... కార్యక్రమాన్ని నిర్వహించారు. హరిత రిసార్ట్ నుండి బస్టాండ్ వరకు పాదయాత్ర చేపట్టి,శ్రమదానం నిర్వహిం చారు. రోడ్డుకు ఇరువైపుల గల చెత్త చేదారాన్ని తొలిగించారు. మురికి కాలువలను శుభ్రం చేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రతి ఒక్కరు గడపాలంటే స్వచ్ఛతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.స్వచ్ఛత పాటిస్తేనే రోగాల బారిన పడకుండా ఉంటామని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని,చెత్త చేదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్లాస్టిక్ వల్ల భూకాలుష్యం పెరిగి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఇచ్చిన స్ఫూర్తితో హక్కుల సాధనకై పోరాడాలన్నారు. బీజేపీ మత రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు.రాజ్యాంగమే సర్వోత్తమైనదని ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని అనుసరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర జీసిసి చైర్మన్ తిరుపతి,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ముధోల్‌లో డిగ్రీ కళాశాల పోస్టర్లు విడుదల

**ముథోల్, మే 13 (ప్రభాత సమాచారం)**
ముధోల్‌లో మంగళవారం ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల పోస్టర్లు, స్టిక్కర్లను, బ్యానర్ లను బిడిసి నాయకులు , అధ్యాపకులు, నాయకులు విడుదల చేశారు. ముధోల్ గత సంవత్సరం ప్రారంభం అయిన డిగ్రీ కళాశాలలో ఈసంవత్సరంలో అడ్మిషన్లు మరింత పెంచేందుకు కళాశాల ప్రిన్సిపల్ బుచ్చయ్య ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు ముధోల్ వీడిసి సహకారాన్ని కోరారు. ఇంటర్ పూర్తి అయిన విధ్యార్థులు డిగ్రీ కోరకు తమ అడ్మిషన్లు కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరడానికి అవకాశం ఉందని కళాశాల అధ్యాపకులు తెలిపారు. మే3వ తేదీ నుంచి ప్రారంభమైన అడ్మిషన్లు జూన్ 19 వరకు అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. మూడు విడతల్లో ఆసక్తిగల విద్యార్థులు డిగ్రీ కళాశాలలో చేరవచ్చని వారు కోరారు. డిగ్రీ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఇంటర్ పూర్తయిన విద్యార్థులు ఈ అవకాశం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముధోల్ బిడిసి అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి దశరథ్, ఉపాధ్యక్షుడు నగేష్,కోశాధికారి వెంకటేష్, రిటైర్ ఉపాధ్యాయులు సుదర్శన్, సాయన్న, నాయకులు పోతన్న, పతంకి కిషన్ పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**జన్నారం, మే 13 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనాన్ని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధూలు జర్నలిస్ట్ లను అన్నారు.సమాజంలో జరుగుతున్న సంఘటనలను ప్రతి ఇంటికి చేరేవేయడంలో జర్నలిస్ట్ నిత్యం కృషి చేస్తున్నారన్నారు. పెన్నునే ఆయుధంగా చేసుకొని సమాజంలో జరుగుతున్న అన్యాయాలను రూపుమాపడంలో విలేకరుల పాత్ర కీలకమైందని పేర్కొన్నారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి జర్నలిస్టు కుటుంబానికి అందేలా చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్



కమిటీ చైర్మన్ లక్ష్మీ నారాయణ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తూకంలో మోసం.. రైతుల ఆందోళన

**ఖానాపూర్, మే 13 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ మండలం ఎర్వ చింతల్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధిక తూకం వేస్తూ క్వింటాల్‌కు 8 కిలోల వడ్లు తరుగు తీస్తున్నారని పిఎసిఎస్ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. మంగళవారం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు సహకార సంఘం చైర్మన్ తో మాట్లాడగా అధిక తూకం విషయంలో



ఎటువంటి సమాధానం ఇవ్వకపోగా అక్కడికి వచ్చిన సెక్రటరీనీ బంధించి ఆందోళన చేపట్టారు. జిల్లా కలెక్టర్ స్పందించి తగిన విచారణ జరిపించాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎర్వచింతల్ రైతులు పాల్గొన్నారు.



## రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలి

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)**
రైతులు పంటల సాగులో భాగంగా ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, మోతాదుకు మించి వాడకూడదని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని సిరిసన్న గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన, పురుగు మందులను విచక్షణ రహితంగా వాడకూడదన్నారు. నీటిని ఆదా చేసుకోవడంతో పాటు పంట వైవిధ్యాన్ని పాటించాలని, నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని, విత్తన రసీదులను భద్రపరచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. రైతులు పంటల సాగులో భాగంగా సమస్యలు వచ్చినప్పుడు వ్యవసపాయ శాఖఅధికారుల తో పాటు శాస్త్రవేత్తలను సంప్రదించి వారి సలహాలు సూచనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్ కుమార్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్ చౌహన్, కె.వికె శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మోహన్‌దాస్ పాల్ పాల్గొన్నారు.



## 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

**జన్నారం, మే 13 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రిని, జన్నారం మండలం ద్వారా భారీ వాహనాల రాకపోకలకు అనుమతించి ఇక్కడ ప్రజల సమస్యలు పరిష్కరించాలని గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)కు మండల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ కన్వీనర్ కొండయ్య కో-కన్వీనర్లు కోడూరి చంద్రయ్య, కడార్ల నర్సయ్య ఆంద్ర పురుషోత్తం, దాసరి శ్రీనివాస్, ఐలవేణి రవి, గుడ్ల రాజన్న షేక్ రియాసత్ అలీ, వర్తక సంఘం అధ్యక్షులు వజ్జల వామన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందన్భంగా వారు మాట్లాడుతూ.. 30 పడకల ఆస్పత్రి ఆవశ్యకతను మంత్రికి వివరించడం జరిగిందన్నారు. అంతేకాకుండా భారీ వాహనాలను గత కొంత కాలం నుంచి నిలిపివేయడం వలన ఈ ప్రాంతంలో వ్యాపారాలన్నీ చాలా దెబ్బతిని, వ్యాపారస్తులు తీవ్ర ఆందోళనలో ఉన్నందున వీటికి వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే లక్షకు పైగా జనాభా కలిగి నాలుగు మండల కేంద్రాలకి కేంద్రంగా ఉన్నటువంటి జన్నారం పట్టణంలో తక్షణమే కమ్యూనిటీ హాస్పిటల్ 30 పడకలతో ఏర్పాటు చేయాలని మంత్రి కి విన్నవించడం జరిగింది. దీనిపైన స్పందించిన మంత్రి అటవీశాఖ అధికారులతో త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేసి ఈ సమస్య పరిష్కారానికి



ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. హాస్పిటల్ ఏర్పాటు చేయడంలో కూడా తగువిధంగా చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.

# ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్

## మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మే 13 (ప్రభాత సమాచారం)** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలని, ఉపాధ్యాయులతోనే సమాజ మార్పు సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండలం తీగల పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమమైన, ఆదర్శనీయమైన సమాజ స్థాపనలో విద్యార్థులను సిద్ధం చేయవలసిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. విద్యార్థి సంపూర్ణ మూర్తిమత్వ సాధన కేవలం ఉ పాధ్యాయులతోనే జరుగుతుందని, మంచి ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులను తయారు చేయగలుగుతారని, సామర్థ్యాల పెంపుకై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, తాను నేర్చుకుంటూ విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థులలో గుణాత్మకమైన మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు నూతనమైన విషయాలను తెలియజేస్తాయని, ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణలో అందిస్తున్న అంశాలను ఆకళింపు చేసుకొని పాఠశాల స్థాయికి తీసుకువెళ్ళి విద్యార్థులలో ఆశించిన మార్పుల సాధన లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణ మూర్తి, కోర్స్ డైరెక్టర్ జి. రామన్న, రిసోర్స్ పర్సన్లు మహేష్, రాజేశ్వరి, రమేష్, రాజన్న, వివిధ మండలాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అడవిలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఉట్నూర్, మే 13 (ప్రభాత సమాచారం)** ఉట్నూర్ మండలంలోని బిర్సాయి పేట్ రేంజ్ పరిధిలో అడవిలోని సోమవారం రాత్రి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ జడ్పీ ఛైర్మన్ జనార్ధన్ రాథోడ్, ఎఫ్డీఓ రేవంత్ చంద్రతో కలసి పర్యటించారు. అక్కడ ఉన్న బేస్ క్యాంపును సందర్శించారు. బీర్సాయి పేట్ రిజర్వ్ ఫారెస్ట్‌లో బుద్ధపూర్ణిమ సందర్భంగా పర్యటించి మూన్ లైట్‌ను చూశారు. చందమామా వెలుగులో అధికారులతో కలిసి అడవిలో నడుచుకుంటూ జంతువుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. అటవీ జంతువుల కోసం చేపడుతున్న అభివృద్ధి పై ఆరా తీశారు. జంతు, అటవీ సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకొని ముందుకు వెళ్లాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. వారి వెంట బోథ్ నియోజక వర్గంలోని ఆయా మండల నాయకులు ప్రీతం రెడ్డి, రవీందర్ రెడ్డి, కేదారేశ్వర్ రెడ్డి, రాహుల్ ముండే, ఇంద్రవెల్లి మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీరామ్ నాయక్, బీర్సాయి పెట్ డిప్యూటీ ఆర్వో ప్రియాంక, బిట్ ఆఫీసర్లు అజయ్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.



### మంచిర్యాల పౌరసంబంధాల అధికారిగా

## కృష్ణమూర్తి బాధ్యతల స్వీకరణ



**మంచిర్యాల, మే 13 (ప్రభాత సమాచారం)** జిల్లా పౌరసంబంధాల అధికారిగా యం. కృష్ణమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ లను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ప్రస్తుతం ఓ.డి.పై జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పని చేస్తుండగా పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లాకు వచ్చారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**మందమర్రి, మే 13 (ప్రభాత సమాచారం)** కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిర్వహిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. పట్టణంలోని ఏఐటీయుసీ కార్యాలయంలో నిర్వహించిన జేఏసీ కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా విభజిస్తూ కార్మికులను బానిసలుగా చేస్తున్న కార్మిక చట్టాల మార్పును వెంటనే ఉపసంహరించుకొని, పాత పద్ధతిలో 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు శక్తులకు దారదత్తం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 20న టోకెన్ సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలన్నారు. సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, నాయకులు




ఎండీ అక్బర్ అలీ, సత్యనారాయణ, మల్లేష్, సుదర్శనం, శ్రీనివాస్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రాజిరెడ్డి, నాయకులు వెంకటస్వామి, ఐలయ్య, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



### బోధన విధానం

## మెరుగుపరచుకోవాలి

**నిర్మల్, మే 13 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ పాఠశాలలో విద్యావిధానాన్ని మరింత సులభతరం చేసేందుకు బోధనా విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎంతో ఉన్నతమైన ఉపాధ్యాయవృత్తిలో ఉన్నారని, వీరి వల్ల దేశ భావి భారత ప్రగతి నిర్దేశించబడుతుందని, కావున ఉపాధ్యా యులు ఎప్పటికప్పుడు తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకో వాలని, వాటి ద్వారా విద్యార్థులకు చక్కని బోధన అందించాలని ఆయన సూచించారు. ఇందుకోసం రాష్ట్రస్థాయి అధికారులు నిర్దేశించిన విధంగా ఇచ్చే ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం డిఆర్పిలు హైదరాబాద్ లో శిక్షణ పొందారని, వీరికి ఈ రోజు ఉదయం జూమ్ ద్వారా శిక్షణ కార్యక్రమం విజయవంతం చేయడానికి తగిన సూచనలు అందించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు అభ్యసన ఫలితాలు, విభిన్న బోధన మెలకువలు, డిజిటల్ బోధన, కృత్రిమ మేధ ఉపయోగించి అభ్యాసాలు కల్పించడం, జీవన నైపుణ్యాలు అందించడం, పనితీరు మెరుగుపరచుకోవడం, నూతన సాంకేతికతలు అలవర్చుకోవడం వంటి అంశాల గురించి, శిక్షణలో వివరాలు అందిస్తారని, వీటిని ఉపాధ్యాయులు చక్కగా అవగాహన చేసుకుని, తమ తరగతి గతి బోధనలో వినియోగించుకోవాలని తెలియజేశారు. జిల్లాలో ఐదు రోజుల శిక్షణను నారాయణ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, గణితం విషయాలు, ఎస్జీటీ తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు, చాణక్య పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్, అందరూ ప్రత్యేక ఉపాధ్యాయులకు, బోధకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఈ శిక్షణకు సమయ పాలన పాటించి, షెడ్యూల్ ప్రకారం జరుపు శిక్షణలో విషయాలను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి, ఎఫ్ఏఓ రమణారెడ్డి, అకడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ప్రవీణ్ కుమార్, కోర్స్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

## బీజేపీ పట్టణ అధ్యక్షులుగా సప్పిడి నరేష్

**మందమర్రి, మే 13 (ప్రభాత సమాచారం)** బీజేపీ పట్టణ అధ్యక్షులుగా సప్పిడి నరేష్‌ను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొద్ది సంవత్సరాలుగా బీజేపీ దాని అనుబంధ సంఘాల్లో క్రియా శీలకంగా పని చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ఆయన సేవలను గుర్తించి పార్టీ పట్టణ అధ్యక్షులుగా నియమించిందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ నాయకులు డివి దీక్షితులు, సంజీవరావు, రోడ్డ మోహన్‌లు మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్ ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసి దీటుగా సమాధానం చెప్పిందన్నారు. దేశాన్ని కాపాడే సత్తా బీజేపీకే ఉందని వారు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రపంచంలో దేశం ఐదవ ఆర్థిక



శక్తిగా రూపొందిందన్నారు. దేశ ప్రజలకు రక్షణ బీజేపీ పాలనతోనే సాధ్యమని వారు స్పష్టం చేశారు. పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి ముందుండి పోరాడుతుందని వారు స్పష్టం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షులు సప్పిడి నరేష్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో పట్టణ అధ్యక్షునిగా నియమించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్, మాజీ అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లిలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు మల్యాల రాజమల్లు, దార రవి సాగర్, తిరుపతి, శ్రీనివాస్, రాజేందర్, సత్యంబాబు, వినయ్ పాల్గొన్నారు.



## జిల్లాలో టీబి ముక్త్ భారత్ అభియాన్
# పకడ్బందీగా నిర్వహించాలి
### మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీషారాజ్

**మంచిర్యాల, మే 13 (ప్రభాత సమాచారం)** దేశ వ్యాప్తంగా చేపట్టిన టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా? హరీషారాజ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, ఎంఎల్.హెచ్.పి., సూపర్వైజర్లు, టి.బి. నియంత్రణ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ టి.బి. ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జిల్లాలో 19 నుండి ప్రారంభించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం 100 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. టి.బి. ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తొందరగా వ్యాధిని గుర్తించడం, సరైన చికిత్స అందించడం, ప్రజలలో మధుమేహం, హెచ్.ఐ.వి., క్యాన్సర్, గుండె, కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి పరీక్షలు చేయించడం జరుగుతుందని, జిల్లాలోని 100 శాతం ప్రభావిత ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఎం.ఎల్.హెచ్.పి.ల ద్వారా ప్రభావిత వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి గ్రామంలోనే పరీక్షలు నిర్వహించేందుకు గాను 2 వాహనాలు కేటాయించి ఎక్స్‌రే, పరికరాలు, సాంకేతిక నిపుణులను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, 60 సం?ల పైబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 100 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో 10 వ్యాధి లక్షణాలలో జ్వరం, 2 వారాలకు మించి దగ్గు, ఛాతినొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గిన, గవద బిళ్ళలు, వాపులు, తెమడలో రక్తం రావడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే పరీక్షలు చేయడం జరుగుతుందని, వ్యాధి నిర్ధారణ అయి వారికి నిక్షయ పోషణ్ పథకం క్రింద ప్రతి నెల 1 వేయి రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఎక్రే పరీక్ష ద్వారా 24 గంటలలో వ్యాధి నిర్ధారణ చేయడం జరుగుతుందని, గ్రామంలో వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రజాప్రతినిధులు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ వైద్యులు, ప్రముఖులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువజన సంఘాలు, టి.బి. వ్యాధి వచ్చిన కోలుకున్న వారు, నిక్షయ మిత్రల సహాయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. 2 రోజులలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మాతా శిశు సంరక్షణ, టీకాల కార్యక్రమం, హెచ్.ఐ.వి. ఎయిడ్స్, లింగ నిర్ధారణ, ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్య సేవలు, ఆసుపత్రి ప్రసవాలు అంశాలపై ప్రోగ్రామ్ అధికారులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా॥సుధాకర్నాయక్, డా॥ఎస్.అనిత, డా॥ఎ.ప్రసాద్, డా॥కృపాబాయి, డా॥అనిల్, జిల్లాలోని 150 మంది వైద్యాధికారులు, ఎం. ఎల్.హెచ్.పి.లు, పర్యవేక్షకులు, జిల్లా టి.బి. మేనేజర్ సురేందర్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

**మందమర్రి, మే 13 (ప్రభాత సమాచారం)** గ్రామ పంచాయతీలలో రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో రోజువారి కార్యకలాపాలు రికార్డులలో నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి డి వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని, గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని పంచాయితీ కార్యదర్శికి ఆదేశించారు. గ్రామ పంచాయతీలోని వాటర్, శానిటేషన్ కు సంభందించిన 7 రిజిష్టర్లను పరిశీలించారు. సెగ్రిగేషన్ షెడ్ లో కంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు. నర్సరీని పరిశీలించి మొక్కలు 100% పెరిగేలా చర్యలు చేపట్టాలని, వేసవి కాలం దృష్ట్యా త్రాగునీరు సరఫరాలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూసుకోవాలని, పైప్ లైన్ లీకేజీలు ఉంటే వెంటనే సరిచేయించాలని అన్నారు. ఆయన వెంట మండల ఎంపిఓ ఎం సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి కె ప్రశాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



**కాసిపేట, మే 13 (ప్రభాత సమాచారం)** కాసిపేట ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం 61 మంది మహిళలకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ అందజేశారు. మండలంలోని చెందిన వివిధ గ్రామాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ రూ.6,107,076 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి అమ్మాయి వివాహానికి కుటుంబ సభ్యులు శ్రమిస్తారని, వారికి బాసటగా ఉండడానికి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఎంతో తోడ్పాటును అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, రెవెన్యూ, మండల అధికారులు నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి



**నార్నూర్, మే 13 (ప్రభాత సమాచారం)** ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న వెనకబడిన ఆదివాసీ గిరిజన ప్రజలకు న్యాయం చేయాలనీ ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకలు మంగళవారం తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ జవహర్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో ఆదివాసుల్లో అర్హులైన వారికే కేటాయించాలన్నారు. ఇందిరమ్మ కమిటీ నిరుపేదలకు గుర్తించి ఇళ్ళు మంజూరు చేయాలనీ అన్నారు. మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూంల వద్ద సరైన సదుపాయాలు లేక ఆదివాసులు ఇబ్బందులు పడుతున్నారని, కరెంట్, నీటి సదుపాయం, రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. మండలంలోని జమాడ గ్రామానికి చెందిన వితంతువు కుమ్రదరియా బాయి ఇల్లు గతంలో కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. అధికారులు పరిశీలించి వెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి సహాయం అందలేదని అన్నారు. మండల కేంద్రంలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా అక్రమ కట్టడాలు చేస్తున్నప్పటికి పట్టించుకోవడం లేదని, ఏజెన్సీ ప్రాంతంలో అక్రమంగా కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి సేడ్మకి రామారావ్, మండల అధ్యక్షుడు పూసం ఇస్రు, ప్రధాన కార్యదర్శి అర్క గోవింద్ మరియు ఏజెన్సీ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి
### బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్...

**తాండూర్, మే 13 (ప్రభాత సమాచారం)** ముస్లిం మైనార్టీలు సోదరులు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. మంగళవారం తాండూర్ సీఐ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పండుగలు ప్రజలందరూ ఐకమత్యంతో జరుపుకోవాలని అన్నారు. కులమత బేధాలు లేకుండా సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. బక్రీద్ పండుగ వస్తున్న నేపథ్యంలో ముందస్తుగా ముస్లిం మత పెద్దలతో కలిసి ఈ శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజల రక్షణ కొరకు తమ పోలీస్ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఏదైనా సమస్యలు ఉన్న తక్షణమే పోలీసు వారికి లేదా (డయల్ 100)కి సమాచారం అందించాలన్నారు. సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్, మాదరం ఎస్సై సౌజన్య, ముస్లిం మత పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

**ఆసిఫాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)** ఆసిఫాబాద్ మండలంలోని అడ గ్రామానికి చెందిన గణేష్ (35) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్యాంరావు తెలిపిన వివరాల ప్రకారం ట్రాక్టర్ డ్రైవరైన గణేష్ వచ్చిన డబ్బులతో తరుచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడేవారు. దీంతో రెండు రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం మద్యం సేవించి ఇంటికి వచ్చిన గణేష్ మనస్థాపానికి గురై ఇంట్లో దులానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమా చారం అందించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## లైంగిక వేధింపుల నివారణకే ఇంటర్నల్ కమిటీ




**మందమర్రి, మే 13 (ప్రభాత సమాచారం)** సింగరేణిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురి అయినట్లైతే సంబంధిత ఇంటర్నల్ కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేయాలని, లైంగిక వేధింపుల సమస్యల పరిష్కారానికే ఇంటర్నల్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. పట్టణంలోని స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్లో మంగళవారం వర్క్ షాప్ టు క్రియేట్ అవేర్నెస్ సెక్సువల్ హరాస్మెంట్ ఆక్ట్ (పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ) పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జీఎం జి దేవేందర్ హాజరయ్యారు. ఈ అవగాహన కార్యక్రమంలో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలో నుండి ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ సభ్యులు పాల్గొనగా, వీరికి పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ అనే అంశంపై విశాఖపట్నానికి చెందిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ అడ్వకేట్, ఎక్స్టర్నల్ ఫ్యాకల్టీ పార్వతీశం పలు అంశాలపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం జి దేవేందర్ మాట్లాడుతూ... సింగరేణిలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగినిలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, సంతోషకరమైన వాతావరణంలో పనులు చేసుకుంటూ, సింగరేణి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం విజయ్ ప్రసాద్, ఎంపిటిసి మేనేజర్ శంకర్, ఎంవిటిసి ట్రైనింగ్ అధికారి అశోక్, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్, మే 13 (ప్రభాత సమాచారం)
రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం చెన్నూరు మండలంలోని కత్తెరసాల, దుగ్నేపల్లి, అంగ్రాజ్‌పల్లి, సుందరశాల, బావురావుపేట, కిష్టంపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించాలని, ధాన్యం విక్రయించిన రైతులకు రశీదు అందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం కేటాయించిన ప్రకారం ట్యాగింగ్ చేయబడిన రైసు మిల్లులకు తరలించాలని తెలిపారు.



నవదుర్గ మాత

# శక్తిపీఠం మన అదృష్టం

మాజీ మంత్రి జోగు రామన్న..

ఆదిలాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)
నవదుర్గా మాత ఆలయ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. దుర్గ నగర్ లోని శ్రీ నవశక్తి మత ఆలయంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు శ్రీ కిషన్ మహారాజ్ నేతృత్వంలో నవశక్తి మత పీఠాన్ని ఊరేగిస్తూ, అమ్మవారి కొలువుదీరిన సందర్భంగా భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తూ పాడి పంటలు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు. ఆలయ అభివృద్ధికి కిషన్ మహారాజ్ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు.

అర్హులైన వారికి రుణాలు

# మంజూరు చేయాలి



కుభీర్, మే 13 (ప్రభాత సమాచారం)
రాజీవ్ వికాస్ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రుణాలు అందించేందుకు బ్యాంక్ అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో సాగర్ రెడ్డి అన్నారు. మంగళవారం యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్లతో కలిసి మాట్లాడారు. అప్లై చేసుకున్న వారి బ్యాంకు డీటెయిల్స్, గతంలో జరిగిన లావాదేవీలను పరిశీలించిన అనంతరం రుణాలు మంజూరు చేసేందుకు వీలుంటుందని బ్యాంక్ అధికారులు తెలిపారు.

## నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

నిర్మల్, మే 13 (ప్రభాత సమాచారం)
నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ సుమన్ తన నిజాయితీని చాటుకున్నారు. సోమవారం నిర్మల్ డిపో కు చెందిన లగ్జరీ బస్సు ఒంగోలు వెళ్తుండగా వరంగల్ నుంచి విజయవాడకు వెళుతున్న ఓ ప్రయాణికుడు బస్సులోని బ్యాగు మర్చిపోయినట్లు తెలిపారు. రెండవ డ్రైవర్ సుమన్ టికెట్లు ఇస్తుండగా బ్యాగు కనిపించడంతో అందులో విలువైన డాక్యుమెంట్లు సర్టిఫికెట్లు ఉండడంతో ఆయనకు ఫోన్ చేసి తిరుగు ప్రయాణంలో విజయవాడలో బాధితులకి అప్పగించడం జరిగిందని నిర్మల్ డిఎం పండరి తెలిపారు.



## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



ముథోల్, మే 13 (ప్రభాత సమాచారం)
భైంసాలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు ఏఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని నిర్మల్ జాతీయ రహదారి పక్కన హెచ్‌పి పెట్రోల్ పంపు సమీపంలో గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని సీఐ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఎస్సై గణేష్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది దాడి చేసి నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ముజాహిద్ ఖాన్‌చ సుల్తాన్, ఇంతియాజ్, షేక్ అహ్మెద్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసుల వాహనాలను చూసి వారు పారిపోతుండగా వారిని పట్టుకొని వారి వద్ద నుండి సుమారు 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

## ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

ఖానాపూర్, మే 13 (ప్రభాత సమాచారం)
ఖానాపూర్ మండలం మస్కాపూర్ జెడ్పి పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. శ్రీనివాస్ తన కుటుంబంతో కలిసి తిరుమల దేవస్థానానికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల తొమ్మిదవ తేదీన గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. రెండు తులాల బంగారం, 5 తులాల వెండి ఆభరణాలు, పదివేల రూపాయల నగదు, చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. విషయాన్ని సీసీ కెమెరాలో గమనించిన యజమాని తన తమ్ముడికి సమాచారం ఇవ్వగా, తమ్ముడు జాడి రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గైక్వాడ్ రాహుల్ తెలిపారు.





వృత్తిని నమ్ముకొని తల్లి

## కష్టాలను తీర్చాలని వెళ్లి..

కుభీర్, మే 13 (ప్రభాత సమాచారం)
కుల వృత్తిని నమ్ముకొని తన తల్లి పడుతున్న కష్టాలను తీర్చాలి అనుకున్నాడు ఓ కొడుకు.. ఉదయమే చేపల వేటకు వెళ్లి విగతజీవిగా మారాడు.. కొడుకుపైనే కోటి ఆశలు పెట్టుకున్న ఆ తల్లి జీవితకాలపు శోకాన్ని మిగిల్చాడు.. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డాడు.. ఈ విషాద ఘటన కుభీర్ మండలం నిగ్వ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. నిగ్వ గ్రామానికి చెందిన లక్ష్మి భర్త గత ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుండి కూలీ పనులు చేస్తూ కొడుకును చూసుకుంటుంది. కొడుకు గంగాధర్(25) తన తల్లి పడుతున్న కష్టాలను తీర్చాలని కుల వృత్తి అయిన చేపలకు వేటకు ప్రతీ రోజులాగే వెళ్లాడు. సోమవారం గ్రామ సమీపంలోని సుద్దవాగు వాగులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో మునిగి మృతి చెందాడు. చేపల వేటకు వెళ్లిన కొడుకు సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి లక్ష్మి, స్థానికులు సుద్దవాగు సమీపంలో గాలింపు చేపట్టగా గంగాధర్ మృత దేహం లభ్యమైంది.. దీంతో కొడుకు మృతదేహాన్ని చూసిన తల్లి లక్ష్మి 'కొడుకా.. నువ్వే గుర్తొస్తున్నావ్.. ఒక్కగానొక్క కొడుకని కూలీ, నాలీ చేసుకుంటూ అపురూపంగా చూసుకున్నా.. నేను పడుతున్న కష్టన్ని చూడలేక నాకు అండగా నిలుస్తానన్నావు.. నమ్ముకున్న కులవృత్తే పొట్టబెట్టుకుంది.. నిన్ను మర్చిపోలేకపోతున్నా బిడ్డా' అంటూ ఆ తల్లి రోదనలు అందరినీ కలిచివేశాయి.. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై రవీందర్ మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్, మే 13 (ప్రభాత సమాచారం)
పట్టణంలోని ఆదర్శనగర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా, నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు దృష్ట్యా ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఆదర్శ్ నగర్‌వాటర్ ట్యాంక్, జగదాంబటెంపుల్, మహమ్మదీ యమజీద్ ఏరియాలో అంతరాయం ఉంటుందన్నారు.

# జొన్నల కొనుగోళ్లు పూర్తి చేయాలి



ఆదిలాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)
జూన్‌లో వ్యవసాయ పనులు మొదలుకానున్న నేపథ్యంలో రైతులు పండించిన జొన్న పంటను మే మాసం లోపే పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారులకు సూచించారు. సాత్నాల మండల కేంద్రంలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. జొన్నల కొనుగోలుపై అసెంబ్లీలో మాట్లాడంతో పాటు వ్యవసాయ శాఖ మంత్రికి విన్నవించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ జిల్లాలో రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 30 నుండి 35 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందని, అకాల వర్షాల నేపథ్యంలో త్వరితగతిన కొనుగోలును పూర్తి చేయాలని కోరారు. త్వరలో కలెక్టర్, మార్క్‌ఫెడ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మహారాష్ట్ర నుండి తెచ్చిన జొన్నలను కొందరి రైతుల పేరిట అమ్ముతున్నారనే సమాచారం అందిందని, ఇలా చేస్తే మన రైతులే నష్టపోతారని తెలిపారు. ఇప్పటికే పలు చెక్పోస్టులను ఏర్పాటు చేశామని అన్నారు. రైతులు తమ గ్రామానికి ఇచ్చిన తేదీల ప్రకారం, ప్రభుత్వ నిబంధనల మేరకు జొన్న పంటను తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. పలువురు బీజేపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు రెన్యువల్ చేసుకోవాలి



నిర్మల్, మే 13 (ప్రభాత సమాచారం)
నిర్మల్ జిల్లాతో పాటు ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో గిరిజన ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు తమ సేవా కొరకు తిరిగి రెన్యువల్ చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి అంబాజీ నాయక్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలతో పాటు గిరిజన ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థ సేవల ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈనెల 31 వరకు గుర్తింపు పొందిన సేవా సంస్థలు ప్రత్యేక ఫోటోలు తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష

**ఆదిలాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఎలాంటి అసౌకర్యాలు అవరోధాలకు తావు లేకుండా జరిగింది. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాశారు. ప్రత్యేకించి బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో అభ్యర్థుల హాజరు శాతాలు ఉత్తేజకరంగా నమోదయ్యాయి. బెల్లంపల్లిలో 1081 మందికి గాను 1026, మంచిర్యాలలో 2558 మందికి గాను 2397, ఆసిఫాబాద్ లో 1032 మందికి గాను 965, నిర్మల్ లో 2422 మందికి గాను 2305, ఆదిలాబాద్ లో 1102 మందికి గాను 1026 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. మంచిర్యాల, కొమురం భీం, ఆదిలాబాద్ జిల్లాల కోఆర్డినేటర్ డాక్టర్



దేవేందర్ రెడ్డి (ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బెల్లంపల్లి) సమర్థవంతంగా పర్యవేక్షించారు. రాష్ట్ర సాంకేతిక విద్యామండలి నుండి స్పెషల్ అబ్జర్వర్ గా తారాసింగ్ పర్యవేక్షించారు. అసిస్టెంట్ కోఆర్డినేటర్గా వెంకటేశ్వర్లు, డీఈవో కార్యాలయం, మంచిర్యాల నుండి మహేశ్వర్ రెడ్డి, కలెక్టరేట్ మంచిర్యాల నుంచి డీటీ లక్ష్మీ నారాయణ బెల్లంపల్లి ఎస్‌హెచ్ఓ దేవయ్య, అధికారులు సమన్వయంతో పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించారు.



## భార్య మరణించిందని మనోవేదనతో భర్త ఆత్మహత్య

**బోథ్, మే 13 (ప్రభాత సమాచారం)**
భార్య మరణంతో ఒంటరితనంతో కృంగిపోయిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బోథ్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రెండ్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ భార్య గత రెండు సంవత్సరాల క్రితం చనిపోయింది. అప్పటి నుండి భార్యలేదని మనోవేదన చెందుతూ ఒంటరిగా ఫీల్ అయ్యేవాడు. ఈ మధ్యకాలంలో మరీ ఎక్కువగా ఆలోచిస్తూ ఏకాంతంగా గడిపేవాడు. చివరకు జీవితంపై విరక్తి చెంది మంగళవారం పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తండ్రి మెస్రం సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తునికాకు సేకరణకు వెళ్లి మహిళకు గాయాలు

**బెజ్జూర్, మే 13 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజూర్ రేంజ్ పరిధిలోని తుని కాకు సేకరణకు వెళ్లి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, బెజ్జూరు మండలం రేచిని గ్రామానికి చెందిన నీకురి సుగుణ భాయ్ 59 సంవత్సరాలు అనే మహిళ సోమవారం ఇందిరగం బీట్ పరిధి లోని రేచిని ఉ ట్ల సమీపంలో తునికి ఆకు సేకరి ఉట్ల స్తుండగా, చెట్టు కొమ్మ విరిగిపోవడంతో సేకరి స్తున్న మహిళ పై తునికాకు చెట్టు కొమ్మ పడడంతో కుడికాలు విరిగిపోయింది. దీంతో మహిళను కాగజ్నగర్ ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక సహాయం అందించాలని బెజ్జూర్ రేంజర్ అధికారికి వినతి పత్రం అందజేశారు.

## రాజీవ్ యువ వికాస్ సిబిల్ స్కోర్ ఎత్తివేయాలి

**మంచిర్యాల, మే 13 (ప్రభాత సమాచారం)**
రాజీవ్ యువ వికాస్ సిబిల్ స్కోర్ ఎత్తివేయాలని పీడీఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వేసవి సెలవులలో పల్లెల్లో నిర్వహించే గ్రామాలకు తరలిరండి అనే కార్యక్రమం మంచిర్యాల జిల్లాలో ముగింపు కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస్ సిబిల్ స్కోర్ ఎత్తివేయాలని ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి, కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల స్థితిగతులు రైతుల కార్మికులపై కళాజాత నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు.

## ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

**ఆదిలాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)**
వచ్చే నెలలో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని పాఠశాల, కళాశాల యాజమా న్యాలు ఇళ్ల నుంచి విద్యార్థులను పాఠశాలలకు తరలించే క్రమంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత వారిపైనే ఉందని ఆదిలాబాద్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పి.రవీందర్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ట్రాన్స్పోర్ట్ కార్యాలయంలో పాఠశాల కళాశాల యాజమా న్యాలతో పాటు డ్రైవర్లకు అటెండర్లకు ఆయా విద్యాసంస్థ లకు సంబంధించిన బస్సుల ఫిట్నెస్పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను సక్రమంగా అమలు చేయాలి

- మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి
- సమాజంలో పోలీసు వ్యవస్థ కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలా విధులను నిర్వర్తించాలి
- నేరడిగొండ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్






**నేరడిగొండ, మే 13 (ప్రభాత సమాచారం)**
జిల్లా వ్యాప్తంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. మంగళవారం ఉదయం నేరడిగొండ పోలీస్ స్టేషన్ సందర్శించి సిబ్బంది చేస్తున్న విధులపై పోలీస్ స్టేషన్లో నమోదవుతున్న కేసుల వివరాలను, కేసుల పరిశోధనపై చేసిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి పోలీసు కు కేటాయించిన గ్రామాన్ని సందర్శిస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, గుడుంబా, మట్కా నిర్వహించకుండా చూడాలన్నారు. ఎలాంటి సమాచారమైనా నేరుగా సంబంధిత పోలీసు అధికారులకు అందించాలని తెలిపారు. సమాజంలో పోలీసు వ్యవస్థకు ఉన్నత స్థానాన్ని కల్పించే విధంగా విధులను నిర్వర్తిస్తూ ఆదిలాబాద్ జిల్లా పోలీసు కీర్తిని పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఉండే ప్రతి ఒక్క సిబ్బందికి సమానమైన విధులను కేటాయించేలా చూడాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, ఫిర్యాదు వచ్చిన వెంటనే గ్రామానికి కేటాయించిన పోలీసు అధికారిని విచారణ నిమిత్తం కేటాయించి బాధితులకు సరైన సమయంలో న్యాయం చేకూర్చే విధంగా చూడాలన్నారు. పిటిషన్ మేనేజ్మెంట్ పై సిబ్బంది ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్లూ కోర్ట్, డైల్ 100 విధులను ప్రతివారం పర్యవేక్షిస్తూ మండల పరిధిలో ఎలాంటి మైనర్ డ్రైవింగ్, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. మండలంలో ముఖ్యంగా గంజాయి లేకుండా ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది సమాజ శ్రేయస్సుకై కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. రాత్రిపూట గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఫింగర్ ప్రింట్ పరికరాన్ని ఉపయోగించి అనుమానితుల్ని, నేరస్తులను వేలిముద్రలను సేకరించి పరిశీలించాలని తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సి ఈ ఐ ఆర్ ద్వారా ఫిర్యాదులను నమోదు చేస్తూ బాధితులకు భరోసాని అందించాలని తెలిపారు. ప్రతి ఒక్క సిబ్బంది కష్టపడుతూ నిజాయితీతో విధులను నిర్వర్తించాలని సూచించారు. సిబ్బంది కి ఎలాంటి సమస్యలున్న తెలియజేయాలన్నారు. నూతన సిబ్బంది సీనియర్ల వద్ద పోలీస్ స్టేషన్లో ఉండే విధులను రికార్డుల నిర్వహణను నేర్చుకోవాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసులను త్వరగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టుల నందు చార్జిషీటు దాఖలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, ఇచ్చోడ సిఐ ఈ భీమేష్, నేరడిగొండ ఎస్సై ఎల్ శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని బలవన్మరణం

**లక్షెట్టిపేట, మే 13 (ప్రభాత సమాచారం)**



పట్టణంలోని గోదావరి రోడ్డుకు చెందిన తొగరి రాజేష్(40) అనే వ్యక్తి మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో లుంగీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... మృతునికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా భార్యకు తనకు కుటుంబ కలహాలు రావడంతో భార్య సుమలత తన ఇద్దరు పిల్లలను తీసుకొని తన తల్లి ఊరైన చొప్పరిపల్లికి నెల రోజుల క్రితం వెళ్లిపోయింది. భార్య, పిల్లలు వెళ్ళిన నుండి మృతుడు తీవ్ర మనస్తాపానికి గురై మద్యానికి బానిసై అదే క్రమంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడన్నారు. మృతుని అక్క మామిడి రాయబోసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న నిందితుడు

**లక్షెట్టిపేట, మే 13 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ పోలీస్ స్టేషన్లో దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను మంగళవారం లక్షెట్టిపేట సబ్ జైలుకు రిమాండ్కు తరలించగా జైలు బయట నుంచి గజానంద్ అనే నిందుతుడు పరారీ కావడం జరిగిందని ఎస్సై సురేష్ తెలిపారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు లక్షెట్టిపేట పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

# 136 క్వింటాళ్ల జొన్నలు సీజ్

**తాంసి, మే 13 (ప్రభాత సమాచారం)**
తాంసీ సబ్ మార్కెట్ యార్డ్లో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకొచ్చిన 136 క్వింటాళ్ల జొన్నలను అధికారులు సీజ్ చేశారు. మంగళవారం మార్కెట్ యార్డులో గుర్తు తెలియని వ్యక్తులు 272 జొన్నల బ్యాగ్లను తీసుకువచ్చారని స్థానికులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. దీంతో సెంటర్ ఇన్చార్జ్, సీఈఓ కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. దింతో సీఈఓ తో పాటు మండల వ్యవసాయ అధికారి రవీందర్, ఎస్ఐ దివ్యభారతిలు మార్కెట్ యార్డ్కు వెళ్లి విచారణ చేపట్టారు. 172 జొన్నల బ్యాగుల విషయంలో రైతులెవరూ ముందు కు రాకపోవడంతో బైట నుండి వచ్చిన జొన్నలుగా గుర్తించిన అధికారులు వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించినట్లు సెంటర్ ఇన్చార్జ్ కేశవ్ తెలిపారు. గుట్టు చప్పుడు కాకుండా మార్కెట్ యార్డ్ కు వచ్చిన ఈ జొన్నల బ్యాగులు ఎవరివి అనే విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.





# ఏజెన్సీ గ్రామాలకు గోదావరి నుంచి తాగు నీరు

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

- రూ. వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు
- శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాలకు తాగు నీరు..
- కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదనలు
- తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక దృష్టి

రక్షిత నీరు అందక కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్న మారు మూల గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన గోదావరి నీరు అందించేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దృష్టి సారించారు. కొమ్రం భీం ఆడ ప్రాజెక్టు నుంచి వస్తున్న రక్షిత నీటిని తాగడానికి గ్రామీణ ప్రజలు ఆసక్తి కనబర్చడం లేదు. నీటి సరఫరా కూడ అంతంతా మాత్రంగానే ఉండడంతో గిరిజన గ్రామాల ప్రజలు తాగు నీటి కోసం తంటాలు పడక తప్పడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే నేరుగా గోదావరి నీటిని గ్రామాలకు తరలించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మెషిన్ భగీరథ అధికారులకు సూచించారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి ఆదిలాబాద్‌కు తాగు నీరు సరఫరా అవుతుంది. అదే విధంగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నీటిని సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాకు తాగు అందించేందుకు అధికారులు రూ. వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసారు. ఈ ప్రతిపాదనల్లో ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లోని గ్రామాలన్నింటికి తాగు నీరు అందించేంచేందుకు రూ. వెయ్యి కోట్లతో ప్రతి పాదనలు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. భైంసా మండలం మాటేగామ్ నుంచి ఉట్నూర్ వరకు సుమారు 150 కిలోమీటర్ల మేర పైప్ లైన్ అవసరం ఉంటుందని, నీటిని శుద్ధి చేసేందుకు నీటి శుద్ధి ప్లాంట్ నిర్మించాలని ప్రతిపాదించారు. రాష్ట్రప్రభుత్వం ఈ ప్రతిపాదనలు ఆమోదించి కేంద్ర ప్రభుత్వ ఆమోదనికి పంపించారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రతిపాధనలకు కేంద్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే గిరిజన గ్రామాల్లో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.



## అడవి పంది దాడిలో గాయపడ్డావారిని ఆదుకోవాలి

**ఆసిఫాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)**

అడవి పంది దాడిలో గాయపడ్డ వారిని ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ జిల్లా ఆటవిశాఖ అధికారి నీరజ్ కుమార్‌ను కోరారు. మంగళవారం బాధితులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆసిఫాబాద్ మండలం కౌటా గూడ గ్రామంలో గత నెల 28న అడవి పందులు చోరబడి రాజు భాయి, రవి, ప్రేమలతలపై దాడి చేసిందని ఇప్పటివరకు వారికి ఎలాంటి ఆర్థిక సహాయం అందించలేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీకానంద్, కార్తీక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో భూభారతి దరఖాస్తుల విచారణ

**ఆదిలాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)**

భూభారత గ్రామ రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం భోరజ్ మండలంలోని డొల్లారా గ్రామం లో నిర్వహించిన భూ భారతి రెవెన్యు సదస్సులో జి ల్లా కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదే విలతో కలిసి 17 దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి పైలెట్ ప్రాతిపాదికన ఆదిలాబాద్ జిల్లాలోని భోరజ్ మండలంలోని 28 గ్రామాల్లో ఈనెల 16వ తేదీ వరకు నిర్వహిస్తున్న రైతు



సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులను ఆర్ఓఆర్ చట్టంలో పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలన్నారు. విచారణ ప్రక్రియను నిబద్ధతో నిర్వహించాలన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే మెరుగైన విద్య

**ఆదిలాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)**



ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత మెరుగైన విద్యను అందించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాలో రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన 11 మంది విద్యార్థులకు మంగళవారం కలెక్టర్ ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసి యేషన్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఐ ఈ గణేష్ జాదవ్, డీఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



## సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన ఉండాలి

**మంచిర్యాల, మే 13 (ప్రభాత సమాచారం)**

ప్రతి ఒక్కరికి సికిల్ సెల్, ఎనీమియాపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సికిల్ సెల్ కార్యక్రమ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సికిల్ సెల్, అనీమియా అనేది జన్యుపరంగా బహుళ తరాల వరకు వచ్చే రక్త సంబంధిత వ్యాధి అని పేర్కొన్నారు. ఈ వ్యాధిలో ఎర్ర రక్తకణాలు కొడవలి ఆకారంలోకి మారి, సరైన రక్త ప్రసరణను అడ్డగిస్తాయని, ఫలితంగా శరీర అవయవాలకు ఆక్సిజన్ సరఫరా తగ్గి, తీవ్రమైన నొప్పులు, బలహీనత, ఊపిరితిత్తుల సమస్యలు వంటి పరిస్థితులు తలెత్తుతాయని అన్నారు. ఇది ఎక్కువగా ఆదివాసీ ప్రాంతాల్లో జన్యుపరంగా ఒక తరానికి మరో తరానికి సంక్రమించే వ్యాధి అని, ఇద్దరు కేరియర్లు వివాహం చేసుకున్నపుడు, వారికి జన్మించే పిల్లలలో సికిల్ సెల్ అనీమియా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులలో సకాలంలో నిర్ధారణ, జాగ్రత్త చర్యలు, జన్యు సలహాలు తీసుకోవడంపై అవగాహన కల్పించటం అత్యవసరమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ శివ ప్రతాప్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

**ఆసిఫాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)**

పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నదీమ్ అహ్మద్ అన్నారు. మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోనీ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ విద్యార్థుల కోసం నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసిందని, ఈ పాఠశాలల్లో అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్య బోధన జరు గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వారి వారి పిల్లలను మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించి ఉన్నత చదువులు చదివిపించి విద్య వంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కాగజ్‌నగర్‌లోని బాలుర మైనారిటీ పాఠశాలలో ఇంటర్ వరకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని, బాలికల కోసం ఆసిఫాబాద్, జైనూర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ



రెసిడెన్షియల్ పాఠశాల ఆర్ ఎల్ సి పుష్పలత, అకాడమిక్ కోఆర్డినేటర్ రిజ్వాన్, ప్రిన్సిపాల్ మల్లేశ్వరి, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబు తాలిబ్, సన్ రైజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ జమీల్, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శేఖ్ రషీద్ పాల్గొన్నారు.



## విశ్వక్ కు విలన్ గా తారక్..

విశ్వక్ సేన్, టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న హీరో, తాజాగా తన సొంత దర్శకత్వంలో కొత్త సినిమా 'కల్ట్'ని అనౌన్స్ చేసాడు. ఈ చిత్రం ఒక మోడ్రన్ పార్టీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. ఇందులో గాయత్రీ భరద్వాజ్, యజ్ఞ తుర్లపాటి హీరోయిన్లుగా నటిస్తున్నారు. అయితే రీసెంట్ గా ఈ సినిమాకు సంబంధించిన ఒక కొత్త అప్‌డేట్ వచ్చింది, 'పుష్ప 2' సినిమాలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న తారక్ పొన్నప్ప, ఈ 'కల్ట్'మూవీలో మెయిన్ విలన్ గా నటిస్తున్నాడు. తారక్ పొన్నప్ప జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమాలో కూడా నెగటివ్ పాత్రలో కనిపించి మెప్పించాడు. దేవర, పుష్ప సినిమాలతో తారక్ పొన్నప్పకు మంచి గుర్తింపు లభించింది. 'కల్ట్'మూవీ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీ, హైదరాబాద్‌లో వచ్చే సోమవారం ప్రారంభం కానుంది. 'కల్ట్'ను తారక్ సినిమాస్, వన్మయి క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రవి బసూర్ సంగీతం అందిస్తున్నారు, 'కేజీఎఫ్', 'సలార్' సినిమాలతో రవి బసూర్ అద్భుతమైన సంగీతం అందించారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే విడుదల కానున్నాయి.



## 'ఓజీ' సెట్‌లో పవన్ కళ్యాణ్!..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓ వైపు రాజకీయాలలో బిజీ బిజీగా ఉంటూనే.. మరోవైపు తాను ఓకే చేసిన సినిమాలను పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ప్రస్తుతం పవన్ లైనప్‌లో ఉస్తాద్ భగత్ సింగ్, ఓజీ, హరిహర వీరమల్లు సినిమాలు ఉన్నాయి. అందులో ఓజీ మూవీపై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. పవన్ పై ఇప్పటికే కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఇక ఆయన ఏపీ పాలిటిక్స్‌లో బిజీ అవ్వడంతో పవన్ లేని సన్నివేశాలను పూర్తి చేస్తున్నారు. ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు. యంగ్ డైరెక్టర్ సుజీత్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తుండగా.. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుంది. అలాగే బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ ఇందులో పవన్‌ను ఢీకొట్టే పాత్ర పోషిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వదిలిన పవన్ ఫస్ట్ లుక్ టీజర్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. అందులో సాంగ్‌కు ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. దీంతో ఈ సినిమా కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. తాజాగా ఈ మూవీ షూటింగ్‌పై మేకర్స్ అదిరిపోయే అప్డేట్ అందించారు. ఈ మేరకు ఇప్పటికే ముగింపు దశకు చేరుకున్న ఈ చిత్రం ఇప్పుడు తిరిగి షూటింగ్ ప్రారంభించుకుంది అంటూ సోషల్ మీడియా వేదికగా మేకర్స్ పంచుకున్నారు. ఇందులో భాగంగా మూవీ సెట్లో దిగిన ఫొటోను పంచుకున్నారు. "మళ్లీ మొదలైంది.. ఈ సారి కంప్లీట్ చేద్దాం" అంటూ ఆ పోస్ట్‌కు క్యాప్షన్ ఇచ్చారు. మరోవైపు ఈ కొత్త షెడ్యూల్ హైదరాబాద్‌లో రాకెట్ స్పీడ్‌లో జరుగుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం.. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మే 14 లేదా 15న సెట్లోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉందని సినీవర్గాల సమాచారం. దీంతో ఇది కాస్త వైరల్‌గా మారడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.



## ధోనీ అంటే పిచ్చి

పంజాబీ భామ మీనాక్షి చౌదరి ఒక్క గ్లామర్ లోనే కాదు, విద్య, స్పోర్ట్స్ లోనూ బహుముఖ ప్రతిభాశాలి. తన వ్యక్తిగత జీవితంలో వైద్య విద్యను పూర్తి చేసి డాక్టర్‌గా అర్హత పొందిన ఈ బ్యూటీ, చదువు మాత్రమే కాకుండా స్విమ్మింగ్, బ్యాడ్మింటన్‌లోనూ మంచి క్రీడాకారిణిగా కూడా గుర్తింపు పొందింది. అలాగే అందాల పోటీల్లో పాల్గొని రన్నరప్‌గా నిలిచి, తన అందం, ఆత్మవిశ్వాసంతో అభిమానులను సంపాదించుకుంది. మొదట బాలీవుడ్ మూవీతో నటనలోకి అడుగుపెట్టిన మీనాక్షి, తరువాత తెలుగు సినీ పరిశ్రమలోకి 2020లో "ఇచ్చట వాహనాలు నిలుపరాదు" అనే సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అయితే "హిట్: ది సెకండ్ కేస్" చిత్రంతో అమ్మడుకి కెరీర్లో మంచి బ్రేక్ లభించింది. ఈ చిత్రం ఘన విజయం సాధించడంతో ఆమెకు కోలీవుడ్ నుండి కూడా అవకాశాలు వచ్చాయి. తమిళంలో విజయ్ ఆంటోనితో కలిసి "కొలై" చిత్రంలో నటించినా, అది ఆశించిన స్థాయిలో ఆడలేదు. కానీ విజయ్ తలపతి తో నటించిన "గోట్" సినిమాలో ఆమె నటన అభిమానులను ఆకట్టుకుంది. దుల్కర్ సల్మాన్ సరసన "లక్కీ భాస్కర్" అనే సినిమాతో మంచి పేరు సంపాదించుకుంది. అయితే బాలీవుడ్ లో "స్త్రీ", "మిమీ" వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన దినేశ్ విజయన్ నిర్మిస్తున్న తాజా చిత్రంలో మీనాక్షి కథానాయికగా నటించబోతున్నట్లు సమాచారం. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా కనిపించే మీనాక్షిని ఓ ఇంటర్వ్యూలో "ఐపీఎల్(IPL) జట్లలో మీకు నచ్చిన జట్టు ఏది?" అని అడిగితే, ఆమె ఇచ్చిన సమాధానం ఇప్పుడు ఫుల్ వైరల్ గా మారింది. తాను ప్రత్యేకంగా ఏ జట్టును ఫేవరెట్‌గా భావించనప్పటికీ, ఎంఎస్.ధోనిపై(M.S Dhoni) తనకు ప్రత్యేక అభిమానం ఉన్నదని చెప్పింది. ధోనీ ఎక్కడ ఆడితే ఆ జట్టే తనకు ఫేవరెట్ అని చెప్పిన మీనాక్షి, ధోని కోసమే తాను క్రికెట్‌ను ఆసక్తిగా చూడడం ప్రారంభించానని వెల్లడించారు. ఈ మాటలతో ధోని ఫ్యాన్స్ కు కూడా ఫేవరేట్ గా మారిపోయింది మీనాక్షి. 33 ఏళ్ల వయసులోనే ఈ బ్యూటీ టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లో అవకాశాలను సొంతం చేసుకుంటూ మల్టీ-ఇండస్ట్రీ యాక్ట్రెస్‌గా ఎదుగుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మీనాక్షి చౌదరి కెరీర్ మరింత విజయవంతం కావాలని అభిమానులు ఎంతగానో ఆశపడుతున్నారు.




## ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను

# దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

■ ఆదివాసీలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే ప్రభుత్వం లక్ష్యం ■ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క

**జన్నారం, మే 13 (ప్రభాత సమాచారం)**

ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలను దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని హరిత రిస్టార్లఓ గత మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలకు శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. మంగళవారం చివరి రోజు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కులం మతం పేరుతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజకీయాలు చేస్తుందని, ఆదివాసీలను ఎప్పుడు కూడా పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ఆదివాసీలకు పెద్దపీట వేసిందని అన్నారు. అదాని, అంబానీల సంపదను పెంచడానికి కోసం బీజేపీ ప్రభుత్వం మైనింగ్‌ల పేరిట అడవులను కట్టబెడుతుందని ఆదివాసీల అభివృద్ధికి ఏ మాత్రం కూడా కృషి చేయలేదని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కులం మతాన్ని నమ్ముతారని ఆదివాసీలు మాత్రం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని నమ్ముతారని, అందుకు నిదర్శనమే ఈ రోజు నేను మంత్రిగా మీ ముందున్నాని అన్నారు. పేద ఇంటిలో పుట్టిన నేను మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా అవకాశం కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. ఆదివాసీల ఆణిచివేతకు బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆదివాసీలను అన్ని రంగాలలో తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందని, ఆదివాసీలను అన్ని రంగాలలో తీర్చి దిద్దాడానికి ఇప్పటివరకు ఇలాంటి శిక్షణ తరగతులు ఎక్కడ కూడా ఏ ప్రభుత్వం కూడా నిర్వహించలేదని కేవలం ఒక కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే నిర్వహించిందని అన్నారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతులకు హాజరైన ప్రతినిధులను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ జాతీయ కన్వీనర్ కొప్పు రాజు, ట్రై కార్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, శ్యామ్ నాయక్, ఏఐసీసీ జాతీయ కన్వీనర్ రాహుల్ బాల్, ప్రోగ్రాం ఇన్చార్జి రానాప్రతాప్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజఫర్ అలీఖాన్,మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ పార్టీ సీనియర్ నేతలు జి.మోహన్ రెడ్డి, సయ్యద్ ఇసాక్, ఎం.రాజశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్ రమేష్ ఇందయ్యా, అజ్మీర నందునాయక్, దాముఖ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.










# జొన్నల కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- బేల మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోళ్లను పరిశీలించిన కలెక్టర్

**ఆదిలాబాద్, మే 13 (ప్రభాత సమాచారం)**

జొన్నల కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం బేల మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోళ్లను పరిశీలించిన కలెక్టర్ రైతులతో మాట్లాడి, వారి



సమస్యలను తెలుసుకున్నారు, జొన్నల కొనుగోలు ప్రక్రియ జూన్ మొదటి వారంలోగా తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. హమాలీలు, లారీల కొరత, తదితర సమస్యల పై ఆరా తీసి వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. రేపటిలోగా హమాలీలు కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో 16 కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇంకా అదనంగా రెండు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది జొన్న పంట అధికంగా వేశారన న్నారు. హమాలీ చార్జెస్, స్టిచింగ్ చార్జెస్ నిబంధనల ప్రకారం తీసుకోవాలని, అధికంగా తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేరే రాష్ట్రం నుండి మన జిల్లాకు జొన్నలు రాకూడదని, జిల్లా రైతుల జొన్నలు మాత్రమే కోనుగోలు చేయాలి. దళారులు ఎవరైనా వేరే రాష్ట్రం నుండి జొన్నలు తీసుకునివస్తే వారి పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీసీవో మోహన్ నాయక్, తదితరులు ఉన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



## పిల్లలకు చిన్నప్పటి నుంచి

# వ్యాయం అవాటు చేయాలి

### పిల్లల పార్కును ప్రారంభించిన ఎస్పీ అఖిల్ మహాజన్

**నేరడిగొండ, మే 13 (ప్రభాత సమాచారం)**

చిన్ననాటి నుండి వ్యాయామ లక్షణం అలవర్చుకోవడం ఉత్తమ లక్షణమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం నేరెడిగొండ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకంగా చిన్నపిల్లల పార్కును అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ క్వార్టర్స్‌లో నివసించే పిల్లలు, బయటి విద్యార్థులు ఈ చిల్డ్రన్ పార్కులో ప్రతిరోజు ఆటలు ఆడుతూ, వ్యాయామం చేస్తూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం ఎస్పీ పిల్లలతో మాట్లాడుతూ చదువుపై ఆసక్తిని పెంపొందించుకుంటూ ఆటలను సైతం ఆడుతూ జీవితాన్ని సంతోషంగా గుడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడా సీఐ భీమేష్, ఎస్ఐ శ్రీకాంత్, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

